# బహుమతి

- డి.వి.డి.ప్రసాద్

పత్రిక నుండి అప్పుడే అందిన ఉత్తరం అందుకొని తెరిచి చదివాను. అంతే! సంతోషంతో గంతులు వేయాలనిపించింది. నా కథ 'దీపావళి కథల పోటీ'లో ప్రథమ బహుమతి పొందిందని తెలియజేస్తూ పత్రిక సంపాదకుడు వ్రాసిన ఉత్తరం అది. ఆనందంతో ఉప్పొంగిపోయాను నేను.

నేను ఓ పదేళ్లనుండి కథలు రాయటం ప్రారంభించినా, నా కథకి ప్రథమ బహుమతి లభించడం ఇదే తొలిసారి. యిప్పటివరకూ ఓ పది కథలు మాత్రం సాధారణ ప్రచురణకు నోచుకున్నాయి. ఈసారి బాగా ఆలోచించి, ఎంతో శ్రమపడి రాసిన కథ అయినా ప్రథమ బహుమతి వస్తుందని అనుకోలేదు నేను. అందుకే ఈ వార్త తెలియగానే ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

'ముందుగా సంతోషకరమైన ఈ వార్త ఎవరికి చెప్పాలి?' వెంటనే ఈ విషయం నా భార్య మాధవికి చెప్పి ఆశ్చర్యపరచాలనిపించింది. ఎందుకంటే మాధవి మా పెళ్లయిన కొత్తలో కథలు రాయటానికి చాలా ప్రోత్సహించేది. అయితే అప్పటికి నా కథల్లో పరిణతి లేకపోవడంతో కథలు ప్రచురణకు నోచుకోలేదు. అయితే కాలేజీ రోజుల్లో, కాలేజీ మాగజైన్‌లో పడ్డ నా కథలు, కవితలు చదివి నాతో ప్రేమలో పడిందామెమరి! అందుకే ముందుగా ఈ సంతోష వార్త ఆమెతో పంచుకోవాలి అనుకొని హాఫ్‌డేకి లీవ్ పెట్టేసి యింటికి బయలుదేరాను. దారిలో ఓ కేజీ స్వీట్స్‌కొని ఆ టైమ్‌లో ఆమెను ఆశ్చర్యపరచి ఊరించి, ఊరించి ఆమెకి చెప్పాలనుకున్నాను.

కాలింగ్ బెల్ నొక్కాను. అయిదు నిమిషాలయినా ఇంకా తలుపు తీసే సూచనే లేదు. మళ్లీ బెల్ నొక్కాను ఈసారి ఇంకొంచెం ఎక్కువసేపు. మెల్లగా వచ్చి తలుపు తీసింది మాధవి. నేను లోపలికి ప్రవేశించాను. ఆమె నాకన్నా ముందుగా వెళ్లి టీవీవద్ద సెటిలై 'డైలీ సీరియల్' చూడటంలో నిమగ్నమైంది.

నేను ఆమెని ఆశ్చర్యపర్చాలని, ''మాధవీ! చూడు! ఏం ఉత్తరం వచ్చిందో!'' అన్నాన్నేను పత్రిక నుండి వచ్చిన ఉత్తరం చూపిస్తూ.

ఆమె ఏమాత్రం ఆసక్తి కనపర్చలేదు. ఇటువైపు తిరిగి కూడా చూడకుండా, ''మా నాన్నగారి వద్ద నుండి వచ్చిందా! ఎలాగున్నారు వాళ్లు? ఏంటి సంగతి!'' అందామె.

టీవీ సీరియల్‌లో అంత లీనమైన ఆమెని డిస్టర్బ్ చేయాలనిపించలేదు ఎందుకో. అయినా ఉద్వేగం అణుచుకోలేక, ''నేను రాసిన కథకి దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది'' అన్నాను.

''ఓహో! అలాగా!'' అందామె చాలా మామూలుగా టీవీ నుండి ముఖం తిప్పుకోకుండా.

విస్తుపోయాను నేను. ఒకప్పుడు నన్ను ప్రోత్సహించిన మాధవి ఈమేనా అని అనిపించింది.

''టేబిల్ మీద టిఫిన్ ఉంది. ఫ్లాస్క్‌లో టీ ఉంది'' అందామె. మారు మాట్లాడక టిఫిన్ తిని, టీ తాగి ఆలోచనల్లోపడ్డాను నేను.

నా ఈ సంతోషవార్త ఎవరితో పంచుకోవాలి అనుకుంటూ ఉంటూంటే హఠాత్తుగా చిన్ననాటి మిత్రుడు రామం గుర్తుకు వచ్చాడు.

అవును! రామం ఈ వార్త వింటే చాలా సంతోషపడతాడు. రామం నా చిన్ననాటి మిత్రుడు. ఇద్దరం కల్సి డిగ్రీదాకా చదువుకున్నాం. చాలా రోజుల నుండి రామం యింటికి కూడా వెళ్లలేదు. అనుకున్నదే తడవుగా రామం ఇంటికి బయలుదేరాను.

నేను వెళ్లేసరికి టీవీలో 'డే అండ్ నైట్' వన్‌డే క్రికెట్ మ్యాచ్ చూస్తూ కూర్చున్నాడు రామం.

నన్ను చూస్తూనే, ''రా! కూర్చో! చాలారోజులయింది నీ దర్శనం అయి!'' అని మరుక్షణం మళ్లీ ఆటలో లీనమైపోయాడు.

''రామం! నా కథకి దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది!'' అన్న నా మాటలు టెండూల్కర్ సిక్సర్ హోరులో కలిసిపోయింది.

నేను మళ్లీ ఏదో మాట్లాడబోగా, ''చూడు! చూడు, యివాళ ఆట మంచి యింట్రెస్టింగ్‌గా ఉంది! ఇవాళ ఇండియా తప్పకుండా గెలుస్తుంది'' అంటూ మళ్లీ ఆటలో లీనమైపోయాడు.

వాడితో మరేం మాట్లాడటం వీలవకపోవడంతో తర్వాత కలుస్తానని వెంటనే బయలుదేరాను. దారిలో తిరిగి వస్తూ ఆలోచించసాగాను, 'నా ఆనందం ఎవరితో పంచుకోవాలి' అని తీవ్రంగా ఆలోచించిన మీదట అప్పుడు తట్టింది, సుబ్బారావు గురించి. సుబ్బారావు ఒకప్పుడు నాటకాల్లో వేషాలు వేసేవాడు. అతను మా సీనియర్ కొలీగ్. నా మొదటి కథ ప్రచురితం అయినప్పుడు అతడే నన్ను అభినందించి వెన్నుతట్టి ప్రోత్సహించాడు.



అనుకున్నదే తడవుగా అతనింటికి బయలుదేరాను. అయితే అతనింటికి వెళ్లేసరికి టీవీలో వస్తున్న డైలీ సీరియల్‌లో లీనమై ఉన్నారు యింటిల్లపాదీ!

ఓ పది నిమిషాల తర్వాత వాణిజ్య ప్రకటనలు రావడంతో అప్పుడు నన్ను గమనించి పలకరించాడు.

''చూసావా! ఈ సీరియల్ ప్రారంభమై మూడేళ్ళైనా యింకా ఏ రోజుకి ఆరోజు చాలా సస్పెన్స్‌గా, ఇంట్రెస్టింగ్‌గా ఉంది! ఒక్క నిమిషం మిస్సయినా ఎలాగో ఉంటుంది!'' అన్నాడు.

నేను నా కథ విషయం చెప్పేసరికి 'అలాగా!' అని అతి మామూలుగా అన్నాడు. ఈలోగా ప్రకటనలు పూర్తయి మళ్లీ సీరియల్ మొదలవడంతో అందులో మునిగిపోయాడు.

కాస్సేపుండి, మరి ఇక ప్రయోజనం లేదని భావించి యింటి ముఖం పట్టాను. నా మొదటి కథ ప్రచురితం అయినప్పుడు నా ఆనందంలో పాలుపంచుకున్న నా శ్రీమతిగానీ, నా స్నేహితుడు రామంగానీ, నా కొలీగ్ సుబ్బారావుగానీ ఈసారి ఇలా ప్రవర్తించడం నాకు చాలా బాధ కలిగించింది. ఈ మూడేళ్ళలో వాళ్లెంతగా టీవీకి బానిసలైపోయారో అనిపించింది.

నేను రాత్రి పదిగంటలకి యింటికి చేరుకునేసరికి, మాధవి యింకా టీవీ వద్ద నుండి లేవలేదు. హఠాత్తుగా, నాకో ఆలోచన వచ్చింది. నా మొదటి కథ అచ్చయిన రోజు మా స్టాఫ్ అందరికీ స్వీట్స్ పంచాను. అందరూ నా కథ చదివి నన్ను అభినందించారు. మరిన్ని రచనలు చేసి పేరు సంపాదించుకోవాలని అన్నారు. అది గుర్తుకు వచ్చి మరుసటిరోజు స్వీట్స్‌కొని స్టాఫ్ అందరికీ ఇచ్చాను. ఆరోజుకి పత్రిక కూడా రావడంతో అందరికీ విషయం చెప్పి కథ చూపించుదామని పత్రిక తీసుకొని వెళ్లాను.

''గురువుగారూ! ఇండియా క్రికెట్ మ్యాచ్ గెలిచిందనా స్వీట్స్ పంచుతున్నారు'' అన్న ఓ కొలీగ్ మాటలకి విస్తుపోయాను. ''గురూగారూ! 'ఆనందరాగాలు' సీరియల్‌లో హీరోయిన్ కష్టాలు తీరినందుకు స్వీట్స్ పంచుతున్నారు కదూ!'' అన్నాడు ఇంకో కొలీగ్.

ఈ మాటలు విన్న నేను నీరుగారిపోయాను. విరక్తి చెంది, పత్రిక డ్రాయర్‌లో మళ్లీ ఉంచేస్తూ, 'మళ్లీ ఈ మనుష్యులందరూ ఎప్పుడు 'టీవీ ట్రాన్స్'లో నుండి బయటపడతారో' అని నిట్టూర్చాను. ఆవిధంగా బహుమతి నన్ను ఆనందపర్చలేకపోయింది మరి!

★